క్లుప్తంగా

హ్యాకథాన్ విజయవంతం

హసన్‌పర్తి : నగరంలోని కిట్స్ కళాశాలలో 24 గంటల పాటు నిర్వహించిన హ్యాక్ థాన్ కార్యక్రమం ఆదివారం విజయవంతమైంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్, టెక్నాలజీ, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ రీసెర్చ్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. 74 విద్యార్థి బృందాలు తమ అద్భుతమైన ఆలోచనలు ప్రదర్శించినట్లు ఐటీ విభాగాధిపతి సింథిల్ మురుగన్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నరేందర్‌రెడ్డి, ఇన్నోవేషన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ రాజు, డాక్టర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

'నిట్'లో నేషనల్ స్పోర్ట్ వీక్ వేడుకలు

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని వారం పాటు నిర్వహించిన నేషనల్ స్పోర్ట్ వీక్ ముగింపు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు కబడ్డీ, బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, చెస్ పోటీలను నిర్వహించారు. విజేతలకు స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ శ్రీనివాసాచార్య బహుమతులను, ప్రశంస పత్రాలను అందజేశారు. పీఈడీ రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి పరిశీలన

మడికొండ: మడికొండలో శ్రీ మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంపైకి ఉన్న రహదారి గతంలో కుంగిపోగా మరమ్మతులు చేస్తున్నా రు. ఆదివారం వరంగల్ జోన్ దేవాదాయ శాఖ ఇంజనీర్ రమేశ్, కాంట్రాక్టర్‌ను పిలిపించి పలు సూచనలు చేశారు. కుంగిన రోడ్డును తిరిగి మరమ్మతు చేయాలని ఆదేశించారు. కార్యనిర్వహణాధికారి శేషభారతి,సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులతోనే ఆదర్శవంతమైన సమాజం



కాజీపేట: ఆదర్శవంతమైన సమాజ నిర్మాణం ఉపాధ్యాయుల వల్లే జరుగుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని 25 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

రైళ్ల రద్దుతో బోసిపోయిన వరంగల్ రైల్వేస్టేషన్



కాశిబుగ్గ : రెండు రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలకు వరద పోటెత్తి ఇంటికన్నె కేసముద్రం మధ్యలో రైల్వేట్రాక్ కింద కంకర కొట్టుకపోవడంతో ట్రాక్ వేళ్లాడుతూ ప్రమాదకరంగా ఉంది. దీంతో రైల్వే అధికారులు వరంగల్ మీదుగా రాకపోకలు సాగించే అన్ని రైళ్లను రద్దు చేశారు. కొన్ని రైళ్లలను దారి మళ్లించారు. సికింద్రాబాద్ డీఆర్ఎం భరతేష్‌కుమార్, ఏడీఆర్ఎం గోపాల్ ప్రత్యేక రైళ్లలో నెక్కొండ వరకు వెళ్లి అక్కడ నుంచి రోడ్డు మార్గంలో ట్రాక్ పనుల పరిశీలనకు వెళ్లారు. శనివారం రాత్రి బీదర్ నుంచి మచిలీపట్నం వెళ్లే మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు వరంగల్ చేరుకోవడంతో అప్పటికే ట్రాక్ దెబ్బతిందన్న సమాచారం రావడంతో అధికారులు రైలును ఆపి వెనకకు మళ్లించారు. రైళ్ల రద్దుతో ఆదివారం ప్రయాణీకులు లేక వరంగల్ రైల్వే స్టేషన్ బోసిపోయింది.

శ్రీనివాస్ సేవలు మరువలేం

వరంగల్ : నగరంలోని 23వ డివిజన్ కొత్తవాడ మాజీ కార్పొరేటర్, మాజీ 'కుడా' సభ్యుడు యెలుగం శ్రీనివాస్ పేద ప్రజలకు చేసిన సేవలు మరువలేమని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పద్మశాలి సంఘం నాయకులు అన్నారు. ఇటీవల మృతి చెందిన శ్రీనివాస్ సంతాప సభను ఆదివారం వరంగల్ కొత్తవాడ పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ భవన్‌లో ట్రస్ట్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు యెలుగం చిన్న కొమరయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా శ్రీనివాస్ చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు తాటిపాముల వెంకట్రాములు, పాల్గొన్నారు.

మాసశివరాత్రి పూజలు

హన్మకొండ కల్చరల్ : శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా శ్రావణమాస బహుళ చతుర్ధశి ఆదివారం మాసశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేకపూజలు శివకల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు గంగు మణికంఠ శర్మ, అర్చకులు ఉదయం నుంచి ప్రభాతసేవ, ఉత్తిష్టగణపతికి ఆరాధన, శ్రీరుద్రేశ్వరునికి రుద్రాభిషేకం నిర్వహించారు. రుద్రేశ్వరశివలింగాన్ని 51 కిలోల పెరుగన్నంతో అమరలింగేశ్వరునిగా అలంకరించి మహాన్నపూజ నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. ఆలయ ఈఓ వెంకటయ్య పర్యవేక్షించారు.



చేతుల మీదుగా గర్భిణిని తీసుకువచ్చిన సిబ్బంది



మైసయ్యనగర్‌లో ఇళ్లలోకి చేరిన వరద నీరు



మడికొండ : కెనరా బ్యాంకు వద్ద నిలిచిన నీరు

తడిసి ముద్దయిన నగరం

వరంగల్, హనుమకొండ, కాజీపేట నగరాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగరం తడిసి ముద్దయింది. నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరద నీరు చేరి నిత్యావసర వస్తువులు, బియ్యం, బట్టలు పూర్తిగా తడిసిపోయాయి. పలు కాలనీలు జలగ్బందంలో చిక్కుకున్నాయి. కాలనీలో చిక్కుకున్న పేద ప్రజలను ఏసీపీ నందిరాం నాయక్ స్వయంగా వరదనీటిలోకి దిగారు. అక్కడి నుంచి వారిని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. స్వయంభూ శ్రీశంభులింగేశ్వరస్వామి దేవాలయం వరద నీటిలో మునిగింది. శివనగర్ సబ్‌స్టేషన్ ప్రాంగణం మొత్తం ముంపునకు గురికావడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ముంపు ప్రాంతాల్లో అధికారులు, కార్పొరేటర్లతో కలిసి ఎంపీ కడియం కావ్య, మేయర్ సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పర్యటించారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఖిలావరంగల్ : శివనగర్ రోడ్లపై ఏరులై పారుతున్న వరదనీరు



అంబర్ బ్రిడ్జి వద్ద బారికేడ్లు పెట్టి రాకపోకలను నిలిపివేసిన పోలీసులు



ముంపు నుంచి వృద్ధురాలిని తీసుకువస్తున్న కాంగ్రెస్ నాయకులు



గోపాలపురంలోని సదాశివకాలనీలో రోడ్లపైకి చేరిన వరద నీరు



శివనగర్‌లో రోడ్డుపై కూలిన భారీ వృక్షం



గుడిసెలో చంటిపిల్లోడితో ఓ మహిళ



నీట మునిగిన మధురానగర్‌కాలనీ రోడ్ నెంబర్-1



కాజీపేట జూబ్లీ మార్కెట్‌లో నీటితో మునిగిన రహదారులు



హసన్‌పర్తి: సుబ్బయ్యపల్లిలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ఆవరణలో నిలిచిన వరద నీరు



గిరిప్రసాద్‌నగర్‌లో భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు



కాజీపేట అర్బన్ : నీట మునిగిన హంటర్‌రోడ్డు



నర్సంపేట ప్రధాన రహదారి క్రిస్టియన్‌కాలనీలో విరిగిన చెట్టును తొలగిస్తున్న కార్పొరేటర్

బ్రీత్ ఎనలైజర్ పనితీరుపై ఉద్యోగుల ఆగ్రహం

- మద్యం సేవించకున్నా రీడింగ్ చూపిస్తున్న బ్రీత్ ఎనలైజర్
- ఆర్టీసీ వరంగల్–2 డిపోలో ఉద్యోగుల నిరసన

హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీలో ప్రమాదాల నివారణకు డ్రైవర్లను పరీక్షించేందుకు వాడుతున్న బ్రీత్ ఎనలైజర్ల పనితీరుపై ఉద్యోగులు మండిపడుతున్నారు. ఉద్యోగులను, కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తప్పుడు రికార్డు చూపిస్తూ ఉద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్న బ్రీత్ ఎనలైజర్లను వాడొద్దని డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం వరంగల్–2 డిపో డ్రైవర్ కత్తి నరేందర్‌కు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా 26 రీడింగ్ చూపించింది. మద్యం అలవాటు లేని తనకు మద్యం సేవించినట్లు చూపించడంతో ఒక్కసారిగా ఆందోళనకు గురికావడంతో ఒళ్లంతా చెమటలు పట్టి బీపీ పడిపోవడంతో సహచర ఉద్యోగులు 108కు సమాచారం అందించారు. అయితే 108 అంబులెన్స్ చేరుకునేలోపు నరేందర్ యథాస్థితికి చేరుకున్నారు. శనివారం మరో డ్రైవర్‌కు ఇదే పరిస్థితి ఎదురుకావడంతో మద్యం సేవించని వారికి కూడా మద్యం సేవించినట్లు బ్రీత్ ఎనలైజర్ రీడింగ్ చూపిస్తుందని ఆరోపిస్తూ వరంగల్–2 డిపోలో ఉద్యోగులు నిరసన తెలిపారు. వరంగల్–2 గేట్‌లో గేట్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ పరికరాలను ప్రామాణికంగా తీసుకోవద్దని డిమాండ్ చేశారు. బ్రీత్ ఎనలైజర్‌లో మద్యం సేవించినట్లు చూపిస్తే వెంటనే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మద్యం సేవించినట్లు వస్తేనే చర్యలు తీసుకోవాలన్నారు. తమకు ప్రతి నెల వచ్చే జీతంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను చిన్నాభిన్నం చేయొద్దని, రోడ్డున పడేయొద్దని కోరారు. బ్రీత్ ఎనలైజర్ ఫలితాన్ని పరిగణలోకి తీసుకుని సస్పెండ్, రిమూవల్ చేయడం ద్వారా ఉద్యోగులు, ఉద్యోగి కుటుంబాలు నష్టపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశా రు. స్టాఫ్ అండ్ వర్కర్ ఫెడరేషన్ వరంగల్–2 డిపో కార్యదర్శి వై.శ్రీనివాస్ మాట్లాడుతూ డిపోకు చెందిన ఎం.డి.యాకూబ్‌కు శనివారం డిపోలోని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా 138 చూపించిందని, వెంటనే పోలీసు స్టేషన్‌కు వెళ్ళి అక్కడి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తే జీరో వచ్చిందన్నారు. అధికారులు స్పందించి ఇలాంటి బ్రీత్ ఎనలైజర్‌లను వాడొద్దన్నారు. గతంలో అధికారులు తీసుకున్న చర్యలతో ఆ ఉద్యోగుల జీవితాలు రోడ్డున పడ్డాయని వాపోయారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



హన్మకొండ అర్బన్ : కలెక్టరేట్ ఎదుట నిరసనలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు



రామన్నపేట : మాట్లాడుతున్న వెంకటస్వామి

హన్మకొండ అర్బన్ : ప్రభుత్వాలు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో భారీ వర్షాన్ని లెక్కచేయకుండా పెద్ద ఎత్తున ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ రాబోయే కాలంలో టీఈజేఏసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నమనేని జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే నూతన పెన్షన్ స్కీమ్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు తమ ఉద్యమాన్ని ఆపేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, డీటీఎఫ్ రాష్ట్ర బాధ్యులు లింగారెడ్డి , టీఎస్‌యుటీఎఫ్ కార్యదర్శి పెండెం రాజు, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, తెలంగాణ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు సర్వర్ హుస్సేన్, ఎస్‌టీయూ అధ్యక్షుడు రాంబాబు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దాస్య నాయక్, టీపీటీఎఫ్ అధ్యక్షుడు రఘుపతి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, పోలీస్ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు మసూర్ హుస్సేన్, టీఆర్‌టీఎఫ్ అధ్యక్షులు రాజబాబు, ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఏకైక ఆకాంక్ష పాత పెన్షన్ అమలు

రామన్నపేట : ప్రభుత్వ ఉద్యోగుల ఏకైక ఆకాంక్ష పాత పెన్షన్ విధానం అమలు అని తెలంగాణ రాష్ట్ర కంట్రీ బ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర బాధ్యులు కొలిపాక వెంకటస్వామి అన్నారు. ఆదివారం వరంగల్, హనుమకొండ జిల్లా శాఖల ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు కందుల జీవన్‌కుమార్, కొంపెల్లి రవీందర్, వేణు, లింగమూర్తి, బుచ్చన్న పాల్గొన్నారు.

నగరంలో 31 పునరావాస కేంద్రాలు

- నిరంతరం అందుబాటులో ఇన్‌చార్జ్‌లు
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: భారీ వర్షాల నేపథ్యంలో ముంపు ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం నగరంలో 31 పునరావస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 66 డివిజన్లలో కేంద్రాలను ఏర్పాటు చేసి ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. రౌండ్ ది క్లాక్‌గా ఇన్‌చార్జ్‌లు తమ విధులను నిర్వర్తిస్తూ ప్రజలకు భోజనం, నీటి సదుపాయం కల్పించాలని సూచించారు.

వరంగల్‌లో..

డివిజన్	సెంటర్
18	ప్రతాప్‌నగర్ కమ్యూనిటీ హాల్
35	శివనగర్, సీపీఎం ఆఫీస్
36	చింతల్ కమ్యూనిటీ హాల్
28	వేంకటేశ్వరస్వామి టెంపుల్
40	ఉర్సు వెంకటేశ్వర హైస్కూల్
41	కాశికుంట చర్చి
42,43	హెచ్ఆర్, వినాయక గార్డెన్లు
17	బొల్లికుంట వార్డు ఆఫీస్
37	బస్తీ దవాఖాన
38	మధ్యకోట యాదవ కమ్యూనిటీ హాల్
20	తిలక్ రోడ్డు కేవీఎస్ ఫంక్షన్ హాల్
14	మార్కెట్ రోడ్డు శుభం గార్డెన్
12	తుమ్మలకుంట లక్ష్మీ గార్డెన్
11	మట్టెవాడ రామయ్య ఫంక్షన్ హాల్
33	రాజశ్రీ గార్డెన్
32	బీఆర్ నగర్ హైస్కూల్

హనుమకొండలో..

1	చింతగట్టు కేఎల్ కన్వెన్షన్‌హాల్
2	సింగారం కేఆర్ ఫంక్షన్ హాల్
3	పైడిపల్లి పద్మశాలి కమ్యూనిటీ హాల్
44,49	భట్టుపల్లి రోడ్డు ఏజీఆర్ గార్డెన్
64	మడికొండ రైతు వేదిక
56	వందఫీట్ల రోడ్డు శ్యామల గార్డెన్
4	యాదవనగర్ కమ్యూనిటీ హాల్
5	కొత్తూరు జెండా కమ్యూనిటీ హాల్
7	బ్రాహ్మణవాడ కమ్యూనిటీ హాల్
58	ఎన్జీవోస్ కాలనీ కేఆర్ఎం ఫంక్షన్ హాల్
9	జక్రియా ఫంక్షన్‌హాల్

ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి



బహిరంగ లేఖను అవిష్కరిస్తున్న మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు

హన్మకొండ అర్బన్ : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో పాటు గత ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలపై అమలు చేస్తున్న నిర్బంధాన్ని గుర్తించి ప్రజాస్వామ్య పునరుద్ధరణను ఏడవ హామీగా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష హోదాలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ఈమేరకు తక్షణమే ఇచ్చిన హామీ మేరకు చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు కోరారు. ఆదివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన బహిరంగ లేఖను వారు అవిష్కరించారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి టి.హరికృష్ణ, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి వి.దిలీప్, టీపీటీఎఫ్, డీటీఎఫ్, ఇతర ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మారోజు స్వర్ణలత

హన్మకొండ చౌరస్తా: మహిళలు ఇల్లు, కుటుంబ బాధ్యతతో పాటు ఆర్థిక స్వావలంభనకై అనుకున్న రంగాల్లో రాణించాలని ప్రొఫెసర్ మారోజు స్వర్ణలత అన్నారు. హనుమకొండ అలంకార్ జంక్షన్‌లోని టీఎన్‌జీఎస్ భవన్‌లో ఆదివారం కామాక్షి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మహిళా కోఆపరేటివ్ సొసైటీ వార్షిక సమావేశం జరిగింది. సొసైటీ అధ్యక్షురాలు గుగ్గిళ్ల శశిరేఖ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ప్రధాన వక్తగా స్వర్ణలత హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థిక సమృద్ధి సాధిస్తూ భవిష్యత్ తరాలకు సా మాజికవర్గ ఆచార, సంప్రదాయాలను అందించా లని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మహిళా విభాగం అధ్యక్షురాలు చిలుకూరి లక్ష్మీరామాచారి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళలదే పూర్తి బాధ్యత, సమాజం దారి తప్పకుండా చూడాల్సిన బాధ్యత కూడా కు టుంబ యజమాని మహిళలదే అన్నారు. సమావేశంలో సభికులను రుద్రోజు భవాని ఆహ్వానించగా వేదపండితులు రవీంద్రచార్యులు, సురేష్ ఆచార్యులు ముందుగా గణపతి, లక్ష్మీదేవి పూజాదికాలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రఖ్యాత చిత్రకారిణి పద్మావతి, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కృష్ణమాచార్యులు, సత్యమనోరమ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



హసన్‌పర్తి: మాట్లాడుతున్న బండా ప్రకాశ్



హన్మకొండ అర్బన్ : బోనంతో వస్తున్న మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ దంపతులు

మడికొండ/కాజీపేట/హన్మకొండ అర్బన్/హసన్‌పర్తి/ఖిలావరంగల్: గ్రేటర్ వరంగల్, హనుమకొండ పరిధిలోని పలు డివిజన్లలో ఆదివారం ఘనంగా బోనాలు నిర్వహించారు. మహిళలు బోనమెత్తుకుని అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శాసనమండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వరంగల్ ఫ్యాషన్ కార్నివాల్ అదుర్స్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కాజీపేట రూరల్ : కాజీపేట ఫాతిమానగర్ వైష్ణవి గ్రాండ్‌లో ఆదివారం జరిగిన వరంగల్ ఫ్యాషన్ కార్నివాల్ ఈవెంట్ షో అదుర్స్‌గా నిలిచింది. వరంగల్ మోడల్స్ సంస్థ ఆర్గనైజర్ అండ్ డైరెక్టర్ గౌస్‌పాషా ఆధ్వర్యంలో ఈవెంట్ జరిగింది. దిలీప్‌రాజ్, హిమాన్సుప్రసాద్, జాబి ఫ్రీ ఈవెంట్ మోడల్స్ సెలెక్షన్ డిజైనర్స్ మేకప్ ఆర్టిస్ట్ పోస్టర్ లాంచింగ్ చేశారు. గౌస్‌పాషా మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ ఫ్యాషన్ షో నిర్వహించినట్లు తెలిపారు. సెలెక్ట్ అయిన యువ మోడల్స్‌ను ఐదుగురు డిజైనర్స్, ఐదుగురు మేకప్ ఆర్టిస్టల ఆధ్వర్యంలో సెప్టెంబర్ చివరి వారంలో గ్రాండ్ ఫినాలె షో నిర్వహించనున్నట్లు తెలిపారు. వరంగల్, హైదరబాద్, కరీంనగర్, మంచిర్యాల్ జిల్లాల నుంచి 23 యువతులు, 15 మంది యువకులు తమదైన శైలిలో మోడలింగ్‌తో ర్యాంప్ వాక్ చేశారు. షో యాంకర్‌గా రోహిణి వ్యవహరించారు. యువతీ, యువకులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ దాడులు

హసన్‌పర్తి: ఆన్‌లైన్‌లో సట్టా నిర్వహిస్తున్న ఓ స్థావరంపై టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించింది. సట్టా నిర్వహిస్తున్న ఏజెంట్‌ను అరెస్ట్ చేసి, అతని నుంచి రూ.10,200లతో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సరస్వతి నగర్‌లో ఆన్‌లైన్ సట్టా నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించింది. భీమారం గ్రామానికి చెందిన జనగాని సురేశ్‌ను అదుపులో తీసుకుని విచారించారు. నిందితుడిని అరెస్ట్ చేసి పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఈ దాడుల్లో సీఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

హన్మకొండ : టీజీ ట్రాన్స్‌కో, డిస్కమ్స్ 2024–25 సంవత్సరంలో జరిగే బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ సర్కిల్ జట్టు క్రీడాకారుల ఎంపిక ఈ నెల 5న నిర్వహిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ ఉమ్మడి వరంగల్ సర్కిల్ స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ కె.వెంకటరమణ తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు ఇంటర్ సర్కిల్ ట్రాన్స్‌కో,డిస్కమ్ టోర్నమెంట్ జరుగనుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ సర్కిల్ జట్టుకు ప్రతిభ కలిగిన విద్యుత్ క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 5న ఉదయం 10 గంటలకు హనుమకొండలోని జవహలాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే సెలక్షన్స్‌కు హాజరు కావాలని ఆయన కోరారు.

వైభవంగా దర్గా సందల్ ఊరేగింపు

- వెండిపాత్రలో గంధాన్ని తెచ్చిన పీఠాధిపతి ఖుస్రూపాషా



గంధంను తీసుకొస్తున్న ఖుస్రూపాషా



దర్గాలో ఖుస్రూపాషాతో కలిసి ప్రార్థనలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కాజీపేట రూరల్ : కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గా ఉర్సు ఉత్సవాలు ఆదివారం అర్ధరాత్రి ముస్లీం సంస్కృతి సంప్రదాయ బద్దంగా ప్రారంభమయ్యాయి. దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా బడెఘర్ నివాసం నుంచి రాత్రి సందల్ (గంధం)ను ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు.బియాబాని కుటుంబీకులు బడెఘర్ వద్ద అత్యంత భక్తిశ్రద్ధలతో సుగంధ ద్రవ్యాల నుంచి తీసిన గంధంను వెండి పాత్రలో భద్రపరిచారు. అనంతరం ఖుస్రూపాషా ప్రత్యేక ప్రార్ధనలు చేసి రాత్రి 12.30 గంటలకు ప్రారంభమైన సందల్ ఊరేగింపు రాత్రి 1.30 గంటల వరకు దర్గా వరకు సాగింది. వెండిగిన్నెను తలపై పెట్టుకొని దర్గాకు తీసుకొస్తుండగా భక్తులు గిన్నెను తాకేందుకు పోటీపడ్డారు. గంధం లేపనంను తీసుకొచ్చి దర్గాకు పూసి ఛాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉత్సవాలు ప్రారంభమైనట్లు ప్రకటించారు. అంతకు ముందు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దర్గాను దర్శించుకొని ఖుస్రూపాషాతో కలిసి ప్రార్థనలు చేశారు.